

సిద్దరామయ్య మూలం కాంగ్రెస్ కాదు : డీకే సురేష్

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య మూలం కాంగ్రెస్ పార్టీ కాదని, ఆయన మరో పార్టీ నుంచి వచ్చినా రెండు సార్లు ముఖ్యమంత్రి అయ్యారని బెంగళూరు గ్రామీణ కాంగ్రెస్ అభ్యర్థి, డీసీఎం సోదరుడు డీకే సురేశ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం రామనగర ఎన్నికల ప్రచారంలో మాట్లాడిన ఆయన పార్టీకి ఎవరు వచ్చినా స్వాగతిస్తామన్నారు. జేడీఎస్‌లో సిద్ద రామయ్యకు అవకాశం లేకుండా తలుపులు మూసివేయడంతో కాంగ్రెస్‌కు వచ్చారన్నారు. అదృష్టం కొద్దీ రెండుసార్లు సీఎం అయ్యారన్నారు. పార్టీ గ్రామస్థాయి నుంచి అభివృద్ధి చెందాలని కార్యకర్తలకు సూచించారు.



రాచనగరిపైనే.. గురి..!

- మైసూరుపై ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి
- రెండేళ్లక్రితం యోగా దినోత్సవంలో భాగస్వామ్యం
- నేడు భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
- హాజరు కానున్న మాజీ ప్రధాని దేవెగౌడ

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాచనగరిగా పేరొందిన మైసూరుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక దృష్టి సారించారు. కొన్నేళ్లుగా పరిశీలిస్తే రాష్ట్ర రాజధాని, ఐటీబీటీ నగరి బెంగళూరు తర్వాత ఎక్కువసార్లు సందర్శించిన నగరం మైసూరు. మైసూరు ప్రాంతంపై ప్రధాని ఆసక్తి కనబరిచేందుకు పలు ప్రత్యేక కారణాలు ఉన్నాయి. ఈ ప్రాంతం కొన్నేళ్లుగా జేడీఎస్‌కు అనుకూలమైనది. దశాబ్దన్నర క్రితంవరకు ఇక్కడ జేడీఎస్ పార్టీ ప్రాబల్యం జోరుగా సాగింది. అయితే ఓ స్థాయికి ఎదిగిన నేతలు జేడీఎస్‌ను వీడి వారికి అనుకూలమైన పార్టీల్లో చేరడం ప్రారంభించారు. ప్రస్తుతం సీఎం సిద్దరామయ్య, కేబినెట్ మంత్రులు చలువరాయస్వామి, బాలకృష్ణ, వెంకటేశ్‌తోపాటు ప్రముఖులు జేడీఎస్‌ను వీడినవారే. దేశమంతటా బీజేపీ ప్రభావం కొనసాగినా మైసూరు ప్రాంతంలో పార్టీకి పట్టు దొరకలేదు. జేడీఎస్‌కు ధీటుగా కాంగ్రెస్ పోటీ పడుతూ వచ్చింది. నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయ్యేందుకు 2014 ఎన్నికల తర్వాత కొంతమార్పు ప్రారంభమైంది. మైసూరు-కొడగు ఎంపీ స్థానం నుంచి ప్రతాప్ సింహ గెలుపొందారు. ఆయన వరుసగా రెండుసార్లు గెలిచారు. అంతకుముందు మైసూరు సంస్థానం రాజు శ్రీకంఠదత్త ఒడయార్ కాంగ్రెస్ నుంచి ఎంపీగా వ్యవహరించారు. చామరాజనగర కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండగా మండ్య, హాసన్ ప్రాంతాల్లో జేడీఎస్ ప్రాబల్యం ఉండేది. అందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మైసూరు ప్రాంతంలో బీజేపీ అభివృద్ధి కోసం పథకం వేశారు.

- 2022 జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవంలో భాగస్వామ్యులయ్యారు. మైసూరుకు చెందిన వేలాదిమందితో కలసి యోగా చేశారు. అప్పటి నుంచి ప్రధానమంత్రి పట్ల మైసూరు ప్రజల్లో అభిమానం పెరిగింది. 2023 శాసనసభ ఎన్నికల వేళ ఏప్రిల్ 30న మెగా రోడ్‌షో చేశారు. ఇది మైసూరు ప్రజలకు మరింత అభిమానం పెరిగేందుకు కారణమయ్యింది. శాసనసభ ఎన్నికల ముగింపు ప్రచారంలో నంజనగూడు శ్రీకంఠేశ్వర ఆలయాన్ని మే 7న ప్రధానిమోదీ సందర్శించారు. శ్రీకంఠేశ్వర ఆలయంలో పూజలు జరిపారు. ఇలా మైసూరుకు వచ్చిన ప్రతిసారి నాడదేవత చాముండేశ్వరి దేవిని దర్శించుకోవడంతో పాటు ఓసారి మైసూరు రాజసంస్థానం ప్యాలెస్‌కు వెళ్లారు. రాజమాత ప్రమోదాదేవి ఒడయార్‌తో చర్చలు జరిపారు. యువరాజు యదువీర్‌తోనూ మాట్లాడారు. అప్పటి నుంచే రాజకుటుంబాన్ని బీజేపీతో సంబంధం ఏర్పాటు చేసుకోవాలని భావించారు. ఇలా సాగుతుండగానే సిట్టింగ్ ఎంపీ ప్రతాప్‌సింహ మరోసారి తానే అభ్యర్థినంటూ చెప్పుకున్నారు. కానీ అధిష్ఠానం ముఖ్యులు ప్రధాని మోదీ సూచనకు అనుగుణంగా చర్చలు జరిపి యువరాజు యదువీర్‌ను రాజకీయాల్లోకి వచ్చేలా ప్రోత్సహించారు. దశాబ్దకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పుకుంటూ వచ్చిన యదువీర్ మైసూరు ఎంపీ అభ్యర్థి అయ్యారు.
- జేడీఎస్ కీలకనేత కుమారస్వామిని పలు సందర్భాల్లో బీజేపీవైపు వచ్చేలా ప్రధాని మోదీ సూచించారు. రాజకీయ పార్టీలతోపాటు వివిధ కారణాలతో ఆయన వెనుకడుగు వేస్తూ వచ్చారు. ఇటీవలే జేడీఎస్‌తో బీజేపీ పొత్తు కుదిరింది. ఇలా జేడీఎస్ నేత కుమారస్వామిని మండ్య నుంచి పోటీ చేయాలని బీజేపీ అధిష్ఠానం సూచించింది. అందుకు అనుగుణంగానే కుమారస్వామి మండ్య అభ్యర్థి అయ్యారు. ఇక దశాబ్దకాలంగా జేడీఎస్‌కు కంచుకోటగా ఉండే హాసన్ నుంచి మాజీ ప్రధాని దేవెగౌడ పెద్దకుమారుడు రేవణ్ణ వారసుడు ప్రజ్వల్ ఎంపీగా కొనసాగుతున్నాడు. మరోసారి అతడిని అభ్యర్థిని చేశారు. ఇక చామరాజనగర బీజేపీ ఎంపీగా కొనసాగుతున్న సీనియర్ నేత శ్రీనివాసప్రసాద్ రాజకీయాలనుంచి రిటైర్ అవుతున్నట్టు ప్రకటించడంతో ఆయన స్థానంలో బాలరాజ్ అభ్యర్థి చేశారు. ఇలా మైసూరు రీజన్‌లో 4 స్థానాలపై దృష్టి సారించారు. ఆదిభారీ బహిరంగసభలో ప్రధాని పాల్గొంటున్నారు. ఇదే వేదికపై మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ కూడా భాగస్వామ్యులు కానున్నారు. ప్రధాని సభ ద్వారా మైసూరు రీజన్‌లో ఉమ్మడి అభ్యర్థులకు కలసి రానుందని ఇరు పార్టీల నాయకులు భావిస్తున్నారు.



రూ.1.40 కోట్ల నగదు స్వాధీనం

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు గట్టి నిఘా విధించారు. పలు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎక్కడిక్కడ తనిఖీలు చేస్తున్నారు. అయినా కూడా కొందరు ఏమార్చేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. శనివారం బెంగళూరు జయనగర్ 4వ బ్లాక్ ప్రాంతంలో ఓ కారులో ఎటువంటి రికార్డులు లేకుండా తరలిస్తున్న రూ.1.40 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. బెంజ్‌కారులో భారీగా నగదు తరలిస్తున్నారన్న సమాచారంతో అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. రెండు కార్లను సోదా చేయగా గోనెసంచుల్లో దాచిన 1.40 కోట్ల రూపాయల నగదు గుర్తించారు. అధికారులు ప్రశ్నించగా మామిడికాయలంటూ ఏమార్చే యత్నం చేశారు. అయితే వారి తీరు అనుమానాస్పదం కావడంతో క్షుణ్ణంగా పరిశీలించగా నోట్లకట్టలు బయటపడ్డాయి. నగదు, లగ్జరీ కార్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న నగదును జయనగర పోలీసులకు అప్పగించారు.



డోలు వాయించి సభను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

ఏ ముఖం పెట్టుకుని మైసూరుకు వస్తారు..?

- ప్రధానివన్నీ అబద్ధాలే..
- సీఎం సిద్దరామయ్య ఆగ్రహం

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో కేవలం అబద్ధాలతోనే పాలన సాగించిన ప్రధాని నరేంద్ర మోదీ ఏముఖం పెట్టుకుని మైసూరుకు వస్తారు? ఏం సాధించారని ఓట్లు అడుగుతారని సీఎం సిద్దరామయ్య సూటిగా ప్రశ్నించారు. అబద్ధాలు చెబుతున్నా ప్రజలు మాత్రం మోదీ మోదీ అంటున్నారనే సంగతి ఆయనకు తెలుసునన్నారు. శనివారం మైసూరు-కొడగు లోక్‌సభ నియోజకవర్గంలోని కృష్ణరాజలో జనధ్వని2 పేరిట భారీ సమావేశాన్ని ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ప్రతి భారతీయుడి ఖాతాకు రూ.15లక్షలు వేస్తానని, విదేశాలనుంచి నల్లధనం వెనక్కి తెప్పిస్తానని హామీ ఇచ్చారని, రైతుల ఆదాయం పెంచుతానని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు హామీలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్, రసాయన ఎరువుల ధరలు తగ్గిస్తామన్న మోదీ హామీ అమలు కాలేదన్నారు. డాలర్‌ను ఎదుర్కొనేలా రూపాయి విలువ పెంచుతామన్నారు. ఇలా హామీలన్నీ అమలు కాక అబద్ధాలుగా మిగిలిపోయాయని మళ్లీ ఓటు అడిగేందుకు వస్తున్నారంటూ ఆక్రోశం వ్యక్తం చేశారు.

- మైసూరులో జయదేవ ఆసుపత్రి నిర్మించింది ఎవరు, తల్లీబిడ్డల ఆసుపత్రి అందుబాటులోకి తెచ్చిందెవరు, స్కూళ్లలో హాస్టల్ సదుపాయం కల్పించింది ఎవరు, మైసూరు అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు ఇచ్చిన ప్రభుత్వం ఏదో ప్రజలకు తెలుసునన్నారు. మేం చేసి పనులను చేసేందుకు బీజేపీకి కూడా అవకాశం కల్పించారని అయితే ఇక్కడి ఎంపీ మాత్రం ఆ పనిచేయలేదన్నారు. ఇచ్చినమాటకు అనుగుణంగా అభివృద్ధి దిశలో సాగుతున్న మాకు అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. సామాన్య కార్యకర్తగా పోరాట నేతగా ఎదిగిన లక్ష్మణ్‌ను గెలిపించాలన్నారు.
- బీజేపీకి మైసూరు-కొడగు ప్రజలు అవకాశం కల్పించినా అభివృద్ధిలో మాత్రం ఎమ్మెల్యే, ప్రధానమంత్రి ఆ దిశగా చొరవ చూపలేదన్నారు. ఇప్పుడు కేవలం అభ్యర్థిని మార్చి ఓట్లు అడుగుతున్నారన్నారు. ఇది ఎంతవరకు సమంజసమంటూ ప్రశ్నించారు. కేవలం తప్పుడు హామీలతో కొనసాగుతున్న ప్రధాని మోదీకి ఓటు అడిగే అర్హత లేదన్నారు. గతంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ 20 అంశాల కార్యక్రమాన్ని అమలు చేశారని, మోదీ మాత్రం ఒక అంశం కార్యక్రమం కూడా చేయలేదన్నారు. స్వాతంత్ర్యానంతరం పేదరిక నిర్మూలనకు ఇందిరా గాంధీ 20 అంశాల కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. అయితే బీజేపీ పదేళ్లలో పేదరిక నిర్మూలనకు ఒక కార్యక్రమం కూడా చేపట్టలేదని ఆరోపించారు. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్థానిక నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




ఇంట్లోనే ఓటేశారు..



ఓటు వేస్తున్న మునియమ్మ

- దివ్యాంగులు, వృద్ధులకు పోలింగ్ ప్రారంభం

విజయపుర, ఏప్రిల్ 13: ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో వినూత్నంగా ప్రవేశపెట్టిన ఇంటి ముంగిటే పోలింగ్ రాష్ట్రవ్యాప్తం గా శనివారం ప్రారంభమయ్యింది. సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగులకు ఇంటి ముంగిట ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. ఈనెల 13, 14 తేదీల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. దేవనహళ్లి తాలూకా విజయపుర పట్టణ పరిధిలో శనివారం 85ఏళ్లు పైబడిన 8మంది వృద్ధులు, ముగ్గురు దివ్యాంగులు తమ ఓటు వేశారు. విజయపుర పట్టణంలోని విజయమహల్ లే అవుట్ ఒకటో క్రాస్‌లోని మునివెంకటప్ప భార్య 88ఏళ్ల మునియమ్మ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అర్హులైన వారి ఇంటికి వెళ్లిన బృందం ఇందుకు సంబంధించి వీడియో చిత్రీకరణ చేశారు. ప్రతి బృందంలో ఒక అబ్జర్వర్, పోలింగ్ అధికారి, రెండో స్థాయి అధికారి, బీఎల్‌ఓ, పోలీసు, వీడియోగ్రాఫర్ ఉన్నారు. ఈ సందర్భంగా సెక్టర్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఫస్ట్ పోలింగ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, పీఆర్‌ఓ సతీశ్‌కుమార్, మైక్రో అబ్జర్వర్స్ పురసభ ముఖ్య అధికారి సంతోష్ సిబ్బంది పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.98	1,577.25
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	112	233
సామర్థ్యం (టీఎంసీలు)	3.99	3.28

చిరుజల్లులతో ..చల్లని కబురు


వర్షంలో రోడ్డు దాటుతున్న వృద్ధుడు


సుశీల్‌నగర్ వద్ద కురుస్తున్న వర్షం


తోరణగల్లు స్టేషన్ దగ్గర వర్షం పడుతున్న దృశ్యం

సండూరు, కుడితిని, కంప్లి, కురుగోడు తదితర ప్రాంతాల్లో శనివారం మబ్బులు కమ్ముకుని వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో కూడా శనివారం కూడా మధ్యాహ్నం 12-30 గంటల నుంచి దాదాపు అరగంట పాటు వర్షం కురిసింది. వర్షం ప్రారంభం కాకముందే రెండు సార్లు పిడుగులు పడ్డాయి. ఈ సంవత్సరం ఇది తొలివర్షం కావడంతో ఎండలకు బాధలుపడుతున్న జనం వాతావరణం చల్లబడిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అడవుల్లో, చిన్న చిన్న కుంటల్లో నీరు నిలిచింది. మొత్తానికి చిన్నపాటి జల్లులు వచ్చినా రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. అలాగే పారిశ్రామిక నగరంగా పేరు పొందిన తోరణగల్లు ప్రాంతంలో కూడా శనివారం కొద్దిపాటి చిరుజల్లులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. ✍ బళ్లారి సిటీ/ కంప్లి/తోరణగల్లు

వేడుకగా దేవ దాసిమయ్య జయంతి


దేవదాసీమయ్యకు నివాళులర్పిస్తున్న తహసిల్దార్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 13: జిల్లా కన్నడ సాంస్కృతిక శాఖ సంయుక్త సముదాయ ఆవరణలో శనివారం దేవ దాసీమయ్య జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లోక్ సభ ఎన్నికలలో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చినందున దేవదాసీమయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వేడుకగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ గురురాజ్ కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముళ్లకంపల తొలగింపు


పాత దరోజీ వద్ద ముళ్లకంచెలను తొలగిస్తున్న అధికారులు

కంప్లి, ఏప్రిల్ 13 : కుడితిని పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత దరోజీ వద్దగల మలుపులో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో అధికారులు, పోలీసులు ముందుకొచ్చి రోడ్డుకిరువైపులా వున్న ముళ్లకంచెలను తొలగించారు. ఇక్కడ శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవలాపురానికి చెందిన వ్యక్తి ఒకరు మృతి చెందాడు. ప్రమాదాల నివారణకు త్వరలోనే ఈ ప్రాంతంలో స్పీడ్‌బ్రేకర్లు కూడా ఏర్పాటు చేస్తామని పోలీసు శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ హిరేమఠ్, ఏఈఈ సురేందర్ రెడ్డి, హాలిగేష్, జేఈ నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు సద్వినియోగం చేసుకోవాలి


కుడితినిలో ఓటు హక్కుపై జాగృతి ర్యాలీ

కంప్లి, ఏప్రిల్ 13 : రాజ్యాంగం తమకిచ్చిన అమూల్యమైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని కుడితిని పట్టణ పంచాయతీ ముఖ్య అధికారి సూర్యకాంత్ తెలిపారు. కుడితిని పట్టణంలో అంగవికలాంగులు త్రిచక్ర వాహనాలపైనా, పౌరకార్మికులు కలిసి పట్టణంలో తిరుగుతూ ఓటు హక్కుపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ముఖ్య అధికారి మాట్లాడుతూ మే 7న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటు ఎలాంటి ప్రభావాలకు లోబడకుండా తమకు నచ్చిన నాయకుడికి వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పురసభ పంచాయతీ సిబ్బంది, పౌర కార్మికులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి

డీ.హీరేహళ్, ఏప్రిల్ 13: రెండు బైకులు ఒకటినొకటి ఢీ కొనడంతో తిప్పేస్వామి(33) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏపీలోని రాయదుర్గం మండలంలో చోటు చేసుకుంది. కర్ణాటక ఉర్థాల్ గ్రామానికి చెందిన తిప్పేస్వామి తన స్నేహితుడు రమేష్ ద్విచక్రవాహనంపై బళ్లారి వైపు నుండి రాయదుర్గంకు వెళుతూ బాదనహాళ్ గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈప్రమాదంలో తిప్పేస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు.. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. గాయపడ్డ వారిని బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు.

నేలను తాకుతున్న విద్యుత్ తీగలు

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని ఎమ్మిగనూరు కేఈబీ అధికారులు

కంప్లి, ఏప్రిల్ 13 : విద్యుత్ అనగానే ప్రమాదం పొంచివుంటుంది. ఎంత మాత్రం అజాగ్రత్తగా వున్నా మృత్యువు కాటేస్తుంది. అందుకే విద్యుత్ శాఖ అప్రమత్తంగా వుంటూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. కాని కంప్లి తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు కేఈబీ అధికారులు మాత్రం విద్యుత్ తీగలు నేలకు తాకుతున్నా తెలిసీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. విద్యుత్ తీగలు నేలకు తాకుతున్నాయని ఎన్నోసార్లు ఎమ్మిగనూరు విద్యుత్ అధికారులకు తెలిపినా వారు కిమ్మనకుండా ఉండిపోతున్నారు. ఎమ్మిగనూరు 4వ వార్డులో విద్యుత్ స్తంభం సగం వంగిపోయింది. రేపో మాపో నేలకొరిగే పరిస్థితి ఏర్పడింది. గాలికాలం కూడా ప్రారంభమవుతోంది. ఎటునుంచి ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామస్తుడు ఎస్.రామప్ప మాట్లాడుతూ ప్రాణనష్టం జరిగే వరకు ఎమ్మిగనూరు 33 కేవీ అధికారులు జాగ్రత్తలు వహించరని, ఏదైనా ప్రమాదం జరిగి ధర్నా చేపడితే అప్పుడు మాత్రమేవారికి తెలుస్తుందన్నారు. అలాగే తిమ్మనకెరె క్యాంపుకు వెళ్లే రోడ్డు మార్గంలో విద్యుత్ తీగలు నేలను తాకుతుండటంతో క్యాంపు ప్రజలే ఒక కట్టెను ఏర్పాటు చేసి వైర్లు నేలకు తాకకుండా ఏర్పాట్లు చేశారు. ఆ ప్రాంతంలో తరచుగా పశువులు తిరుగుతుండటంతో రైతులంతా ముందుకొచ్చి ప్రమాదం జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారని క్యాంపు వాసులు తెలిపారు. ఇన్ని జరుగుతున్నా విద్యుత్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు జాగ్రత్త వహించి మరమ్మతు పనులు చేపట్టకపోతే ప్రతిఘటన చేపడతామని హెచ్చరించారు.


తిమ్మనకెరె క్యాంపు వద్ద విద్యుత్ తీగలు నేలను తాకకుండా కట్టెను ఏర్పాటు చేసిన దృశ్యం

సిరుగుప్పకు రైల్వే జోన్

మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప


బహిరంగసభలో మాట్లాడుతున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, ఏప్రిల్ 13 : కొప్పళ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప కోరారు. శనివారం సిరుగుప్ప పట్టణం కొప్పళ లోక్‌సభ నియోజకవర్గంలో అభ్యర్థి డాక్టర్ బసవరాజు తరపున ప్రచార సభ జరిగింది. ఈ సభలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప మాట్లాడుతూ మోదీ మూడవ సారి ప్రధాని కావాలంటే డాక్టర్ బసవరాజును గెలిపించాలని కోరారు. కొప్పళ లోక్‌సభ అభ్యర్థి బసవరాజు మాట్లాడుతూ భారీ మెజార్టీతో తనను గెలిపిస్తే సిరుగుప్పకు రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామన్నారు. విశ్వ విద్యాలయాలు, నూతన కళాశాలలను తీసుకువస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ శివరామ్ గౌడ, తాలుకా బీజేపీ అధ్యక్షులు మల్లికార్జున స్వామి, బీజేపీ యువ నాయకులు ధరప్ప నాయక, దొడ్డ ఉలిగప్ప, మైకేల్ వీరేష, శేకప్ప, కళగల్ బసవరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీరు అందక జనం హాహాకారాలు


కౌల్‌బజార్‌లో మురుగు కాలువవద్ద పైపు నుంచి నీరు పట్టుకుంటున్న ప్రజలు


ట్యాంకర్లలో నీటి కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

బళ్లారి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) బళ్లారి నగరంలో తాగునీరు దొరక్క జనం ఇబ్బంది పడుతున్నారు. 15 రోజులుగా కొళాయిల్లో నీరు రావడం లేదు. శాసనసభ్యులు, ఇతర ప్రజాసంఘాలు, సంఘ సేవాసంస్థలు ట్యాంకర్లు ద్వారా నీరు అందిస్తున్నా అవి అరకొరగానే ఉంటున్నాయి. ఒక ట్యాంకర్ నీరు ఒక వీధికి వస్తే అవి ఏమాత్రం సరిపోవడం లేదు, దీంతో ప్రజలు మునుపెన్నడూ లేని విదంగా నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. కొళాయి నీళ్ల వస్తున్నా అవి పూర్తి సమయం రావడం లేదు. గత్యంతరం లేక మురికి కాలువల వద్ద కొళాయి పైపులు పగిలి లీక్ అవుతున్న చోట నీటిని బిందెల్లో నింపుకుని అవసరాలు తీర్చుకుంటున్నామని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగపూట కూడా నీటి కోసం బిందెలతో రోడ్డపై రోజంతా నిరీక్షించాల్సి అవసరం రావడం బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా పేట బసవేశ్వరస్వామి రథోత్సవం


పేట బసవేశ్వరస్వామి మూలవిరాట్

కంప్లి, ఏప్రిల్ 13: కంప్లి తాలుకా ఎమ్మిగనూరు గ్రామంలో పేట బసవేశ్వరస్వామి రథోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేలాది మంది భక్తాదుల నడుమ రథంపై స్వామివారిని ఊరేగించారు. వామదేవ శివాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఐదు రోజులుగా స్వామికి పల్లకి సేవ, పంచామృతాభిషేకం, జలాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. కంప్లి, కురుగోడు, బళ్లారి, సిరుగుప్ప, తదితర పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి మొక్కులు సమర్పించుకున్నారు.

సత్తాచాటిన గురుతిప్పేరుద్ర కళాశాల విద్యార్థులు


మేఘన


యశ్ గుప్తా


నందిని


గీతాంజలి


శివరాజ్‌కుమార్


మోనికా


మహేశ్వరీ


నాగేంద్ర

బళ్లారి సిటీ, ఏప్రిల్ 13: ద్వితీయ పియూసీ పరీక్షల్లో శ్రీ తిప్పేరుద్ర కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫలితాల్లో తామే మేటి అని నిరూపించుకున్నారు. సైన్స్‌లో మేఘన కరువల్లి 576/600, యశ్ గుప్త్ 545, నందిని 535, వాణిజ్య విభాగంలో గీతాంజలి 566, శివరాజ్‌కుమార్ 563, మోనికా 559, నవీన్‌రెడ్డి 558, మహేశ్వరీ 554, నాగేంద్ర 545 ఉత్తమఫలితాలు సాధించారు. గురుతిప్పేరుద్ర (ఎస్.జీ.టీ) కళాశాలలో 28మంది విద్యార్థులు ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులు కాగా, 142 మంది ప్రథమశ్రేణిలో, 48 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను శిక్షణ సంస్థ అధ్యక్షులు రుద్రప్ప, కార్యదర్శి నాగరాజ్, పియూసీ కళాశాల ప్రిన్సిపాల్ తిప్పేరుద్ర అభినందించారు.

వెటరన్ జర్నలిస్టు మృతికి నివాళులు

కంప్లి, ఏప్రిల్ 13 : తెలుగుపత్రికలో రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ జానీ రెండు రోజుల క్రితం మృతి చెందడంతో శనివారం కంప్లి పట్టణంలో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంగి మంజునాథ్, వెంకటేష్ మాట్లాడుతూ ఆయన 20 సంవత్సరాలుగా తెలుగు పత్రికలకు సేవలందించారన్నారు. అనారోగ్యానికి గురై బెంగళూరులో చికిత్స పొందుతూ కూడా విధులు నిర్వహించారంటే ఆయనకు పత్రిక రంగంపై ఎంత ఆసక్తి వుందో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిరత పత్రికార సంఘం కమిటీ సభ్యులు దేవనగౌడపటేల్, రసూల్, తాలుకాఅధ్యక్షులు వీరేష్, చంద్రశేఖర్‌గౌడ, కరివిరుపాక్షి, యమునమ్మ, శాస్త్రి, ఇస్మాయిల్‌పాల్గొన్నారు.


మృతి చెందిన సయ్యద్ జానీకి నివాళులర్పిస్తున్న విలేకరులు

హోసూరు జోన్

● కృష్ణగిరిలో త్రిముఖపోటీ ● 19న పోలింగ్

ప్రధాన అభ్యర్థులందరిదీ తెలుగు నేపథ్యమే

హోసూరు, ఏప్రిల్ 13: కృష్ణగిరి జిల్లాలో ప్రతిసారి లోక్‌సభ ఎన్నికల్లో నియోజక వర్గ ఓటర్లు తమ ప్రత్యేకతను కనబరుస్తునే ఉంటారు. తమిళనాడు అన్ని నియోజకవర్గాల్లో ఇంచుమించు ఒకే విధంగా ఉన్నా కృష్ణగిరి జిల్లాలో మాత్రం అంచనా వేయడం కొంత కష్టమేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో కూడా ఆరు అసెంబ్లీ నియోజక వర్గాల్లో అంచనాలు తారుమారై డీఎంకే మూడు స్థానాలు, అన్నాడీఎంకే మూడు స్థానాలు దక్కించుకున్నాయి. రాష్ట్రమంతా ఒకవైపు ఉంటే కృష్ణగిరి జిల్లా మాత్రం ప్రత్యేకంగా ఉండడానికి ఈ జిల్లా కర్ణాటక, ఆంధ్ర సరిహద్దుల్లో ఉండడమే కారణమని చెప్పవచ్చు. మూడు నియోజకవర్గాల్లో తెలుగు ఓటర్లు నిర్ణయాత్మకంగా ఉన్నారు. ఈ కారణంగా ప్రతి అభ్యర్థి కూడా తెలుగు ఓటర్లను ఆకట్టుకునేందుకు తమ వంతు ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. తెలుగు ఓటర్లు ఎటువైపు వెళ్లినా ఇంతవరకు తెలుగు వారికి ఒరిగిందీ ఏమి లేదు, తెలుగు భాషాభివృద్ధికి నిలబడింది లేదు.

ప్రస్తుతం కృష్ణగిరిలో త్రిముఖ పోటీ నెలకొంది. కృష్ణగిరి లోక్‌సభ పరిధిలో ఉత్తంగర్రై, బర్గూరు, కృష్ణగిరి, వేపనపల్లి, హోసూరు, తళి శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. అన్నాడీఎంకే, కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటీ ముమ్మరంగా ఉన్నందున వారు ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. ఆరు నియోజకవర్గాల్లో ప్రతి అభ్యర్థి ఓటర్లను ఆకర్షించేందుకు కార్యక్రమాలు చేపట్టారు. సమయం చాలా తక్కువగా ఉన్నందున విశ్రాంతి లేకుండా ఎండను కూడా లెక్కచేయకుండా నియోజక వర్గాల్లో పర్యటిస్తున్నారు. కాగా కృష్ణగిరిలో బీజేపీ అభ్యర్థి తరపున ప్రచారంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఓటర్లను ఉద్దేశించి తెలుగులో ప్రసంగించారు. ఇలా తెలుగు ఓటర్లను ఆకర్షించేందుకు కీలకనేతలు ప్రచారం చేస్తున్నారు.

త్రిముఖ పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులు ముగ్గురూ తెలుగు నేపథ్యం కల్గినవారు కావడం విశేషం. కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో 27 మంది బరిలో ఉన్నారు. ప్రధాన పోటీ మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యనే ఉంది. అన్నాడీఎంకే అభ్యర్థి జయప్రకాశ్, 'ఇండియా' కూటమి అభ్యర్థి గోపినాథ్, ఎన్డీయే అభ్యర్థి బీజేపీ తరపున నరసింహన్, నామ్ తమిళర్ అభ్యర్థి వీరప్పన్ కుమార్తె విద్యారాణి ప్రధానంగా పోటీలో ఉన్నారు. ఈనెల 19న పోలింగ్ ఉండడంతో ప్రచారం పోటాపోటీగా సాగుతోంది. పోలింగ్‌కు సంబంధించిన సమీక్షలు ఒక్కోరకంగా ఉండడంతో సర్వత్రా ఆసక్తిగా నెలకొంది. ఇక్కడ గెలుపు ఎవరనేది కుతూహలంగా మారింది. ఓటర్లు 16,23,172మంది ఉండగా గత లోక్‌సభ ఎన్నికల్లో 79శాతం ఓటింగ్ నమోదైంది.


అన్నాడీఎంకే జయప్రకాశ్


బీజేపీ నరసింహన్


కాంగ్రెస్ గోపినాథ్

ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

హోసూరు(కృష్ణగిరి) ఏప్రిల్ 13: కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ సరయు శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌లవారీగా చేపట్టాల్సిన జాగ్రత్తలను సూచించారు. సమావేశంలో అబ్జర్వర్ కిరణ్ కుమారి పాసి, వ్యయ పరిశీలకుడు సుధాంశు శేఖర్ గౌతమ్ పాల్గొన్నారు.


సమావేశంలో కలెక్టర్ తదితరులు

పార్టీ గెలుపే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలి

బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి రాధామోహన్ అగరవాల్


మాజీ మంత్రి శివనగౌడ నాయక్ నివాసంలో సమావేశమైన రాధామోహన్ అగరవాల్

రాయచూరు, ఏప్రిల్ 13 : దేశంలో ప్రజలకు సుస్థిర పాలన అందించే దిశగా నరేంద్ర మోదీ నాయకత్వంలో తిరిగి బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి రాధామోహన్ అగరవాల్ అన్నారు. ఇందుకోసం పార్టీ శ్రేణులు అభ్యర్థి ఎవ్వరన్న దానితో నిమిత్తం లేకుండా పార్టీ గెలుపే లక్ష్యంగా ఐక్యతతో శ్రమించాలని సూచించారు. రాయచూరు స్థానం నుంచి లోక్‌సభ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ పేరును అధికారికంగా ప్రకటించిన అనంతరం పార్టీ శ్రేణుల్లో నెలకొన్న అసంతృప్తిపై చర్చించేందుకు రాధామోహన్ అగరవాల్ శనివారం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా నాయకులతో వరుస సమావేశాలు నిర్వహించిన రాధామోహన్, పార్టీ తీసుకున్న నిర్ణయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కట్టుబడి ఉండాలని సూచించారు. అదే సమయంలో బీజేపీ రాజకీయ పార్టీగా ఒక కుటుంబంతో సమానమని కుటుంబంలో భిన్నాభిప్రాయాలు ఉన్నా అన్ని అంతర్గత సమావేశాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు.


ఉగ్రవాద నిర్మూలన మోదీతోనే సాధ్యం

రాయచూరు, ఏప్రిల్ 13 : దేశంలో ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడంతో పాటు ప్రజల్లో ఉన్న భయాందోళనలను తొలగించే శక్తి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికే ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజీవ్ అన్నారు. పార్టీ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాకు వచ్చిన రాజీవ్ నగరంలో విలేకరులతో కొద్దిసేపు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. లోకసభ ఎన్నికల్లో నరేంద్ర మోదీ పట్ల ప్రజలు దేశవ్యాప్తంగా సానుకూలంగా ఉన్నారని మూడవ సారి మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం తథ్యమని జోస్యం చెప్పారు. కాగా రాష్ట్రంలో కొన్ని స్థానాల్లో అభ్యర్థుల ఎంపికలో కొంత అసంతృప్తి ఉన్నప్పటికి పార్టీ గెలుపు కోసం నాయకులందరు కలిసి కట్టుగా పని చేస్తున్నట్లు రాజీవ్ తెలిపారు. బెంగళూరులోని రామేశ్వర కెఫె వద్ద బాంబ్ దాడికి కారకులైన నిందితులు పశ్చిమ్ బెంగాల్‌లో పట్టుబడ్డారని రాజీవ్ వివరించారు. ఈ విషయంలో దేశ భద్రతే లక్ష్యంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

రమణ మహర్షి (వర్ధంతి)



రమణ మహర్షి 1879 డిసెంబరు 30న తమిళనాడు రాష్ట్రం విరుద్‌నగర్ జిల్లా తిరుచ్చుళి ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు వెంకటరామన్ అయ్యంగార్. 16ఏళ్లకే మోక్షజ్ఞానం పొంది తిరువణ్ణామలైలోని అరుణాచల పర్వతాలపై స్థిరపడ్డారు. తనను తాను అతియాశ్రమిగా ప్రకటించుకున్నారు. చాలా తక్కువగా ప్రసంగించేవారు. ఆమె తల్లి సమాధి సమీపంలోనే ఆశ్రమాన్ని నిర్మించారు. తన మౌనంతో సందేశం పొందలేనివారికి మాత్రమే మాటల ద్వారా మార్గం చూపేవారు. స్వీయశోధన ఉత్తమమని సూచించేవారు. అద్వైతం, ఉపనిషత్తుల సారాన్ని బోధించారు. 1950 ఏప్రిల్ 14న పరమపదించారు.

బీఆర్ అంబేడ్కర్ (జయంతి)




'బాబాసాహెబ్'గా పేరొందిన భారత రాజ్యాంగ నిర్మాత, భీమ్ రావ్ రామ్‌జీ అంబేడ్కర్ 1891 ఏప్రిల్ 14న అప్పటి సెంట్రల్ ప్రావిన్సెస్‌లో సైనిక స్థావరమైన మౌ అనే ప్రాంతంలో (ప్రస్తుతం మధ్యప్రదేశ్) జన్మించారు. ఆర్థికవేత్త, రాజకీయనేత, సంఘ సంస్కర్త. అస్పృశ్యతపై సుదీర్ఘ పోరాటం చేశారు. దీనదళితుల ఉద్ధరణకు పాటుపడ్డారు. మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా వ్యవహరించారు. తన రచనలు, బోధనలతో ప్రజలను చైతన్యం తెచ్చారు. బాంబే లెజిస్లేటివ్ అసెంబ్లీ, కౌన్సిల్‌లోనూ సభ్యుడిగా కొనసాగారు. న్యాయ, సామాజిక, ఆర్థికశాస్త్రాలలో పరిశోధనలు చేశారు. 1956 డిసెంబరు 6న కన్నుమూశారు. మరణానంతరం 1990లో దేశ అత్యున్నతమైన 'భారతరత్న' ప్రకటించారు.

షంషాద్ బేగం (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత షంషాద్ బేగం 1919 ఏప్రిల్ 14న లాహోర్‌లో జన్మించారు. హిందీ సినీరంగంలో తొలి నేపథ్య గాయని. హిందీ, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, తమిళ, పంజాబీ భాషలలో 6వేలకుపైగా పాటలు పాడారు. నౌషాద్ అలీ, ఎస్‌డీ బర్మన్, ఓపీ నయ్యర్ వంటి సంగీతదర్శకుల నేతృత్వంలో పాటలు ఆలపించారు. ఓపీ నయ్యర్ అవార్డు గ్రహీత. 1940 నుంచి 1970ల మధ్య ఆమె పాడిన పాటలు నేటికీ ఆదరణ పొందుతున్నాయి. 2013 ఏప్రిల్ 23న కన్నుమూశారు.

గొల్లపూడి మారుతీరావు (జయంతి)



గొల్లపూడి మారుతీరావు 1939 ఏప్రిల్ 14న విజయనగరంలో జన్మించారు. రచయిత, నటుడు, సంపాదకుడు, వ్యాఖ్యాత, పాత్రికేయుడు. సాహిత్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. తెలుగు సినీరంగంలో మాటల రచయితగాను, నటుడిగాను సుపరిచితులు. తెలుగు సాహిత్యంపై ఆయన రాసిన పరిశోధనాత్మక రచనలు, నాటకాలు యూనివర్సిటీలలో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. సినిమాలలోకి రాకముందు నాటకాలు, కథలు, నవలలు రాశారు. రేడియో ప్రయోక్తగా, అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా, ఆంధ్రప్రభ దినపత్రిక ఉప సంపాదకులుగా పనిచేశారు. ఉత్తమ కథా రచయితగా ఐదు నంది అవార్డులు అందుకున్నారు. 2019 డిసెంబరు 12న కన్నుమూశారు.



అలంకరణలో స్వామివారు

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 13: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి వారికి చైత్ర మాసం తొలి శనివారం సందర్భంగా విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు పూజలు నిర్వహించారు. వేకువజామున, సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర నిర్వహించి వెండికవచ అలంకరణ, పుష్పలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. మాజీ ధర్మకర్త కాశీనాథ్‌శెట్టి సిబ్బంది ఓబున్న పాల్గొన్నారు.

17న సీతారాముల కల్యాణం

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 13: మండలంలోని పాలవెంకటాపురం గ్రామంలో 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా రామాలయం లో సీతారముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త అమరలింగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీపీఎం ఎన్నికల ప్రణాళిక విడుదల

బాగేపల్లి, ఏప్రిల్ 13: 2024 లోక్‌సభ ఎన్నికల ప్రణాళికను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి యు బసవరాజు నేతృత్వంలో పట్టణంలోని సుందరయ్యభవనంలో విడుదల చేశారు. శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో బసవరాజు మాట్లాడుతూ లౌకికవాద, ప్రజాస్వామ్య దేశంలో ప్రస్తుతం బెదరింపులు అధికమయ్యాయన్నారు. బీజేపీ, మిత్రపక్షాలను ఓడించేందుకు పార్లమెంటులో వామపక్షాల సత్తా చాటేలా ప్రజలు సీపీఎం, ఇతర పార్టీలను గెలిపించాలని కోరారు. పార్లమెంటులో పాలనా యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. నాలుగు స్తంభాలుగా పేర్కొనే లౌకికవాదం, ఆర్థిక సార్వభౌమత్వం, సమాఖ్య వ్యవస్థ, సామాజిక న్యాయం వంటివి ఆశించిన మేరకు అమలుకాక దెబ్బతిన్నాయన్నారు. మోదీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను నాశనం చేసేలా ఫాసిస్ట్ విధానాలు అమలు చేస్తోందన్నారు. ప్రపంచంలో భారత్‌కు గుర్తింపు తెచ్చినప్పటికీ మరోవైపు విషపూరిత మత సిద్ధాంతాలతో ప్రజలను విభజిస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో 18వ లోక్‌సభకు జరిగే ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న లౌకికదేశాన్ని హిందుత్వ దేశంగా మార్చే యత్నం జరుగుతోందని ఇందుకు బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపిస్తోందంటూ ఆరోపించారు. పార్టీ కేంద్రసమితి సభ్యుడు టీఎస్ ఉమేశ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ (టాడా), నగదు రవాణా నియంత్రణ చట్టం (పీఎంఎల్‌ఏ) వంటి కఠిన చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలో వామపక్షాలను బలపరిచేలా సీపీఎంకు మద్దతు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ అభ్యర్థి ముని వెంకటప్ప, సీపీఎం తాలూకా కార్యదర్శి రఘురామరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్ అవులప్ప, సావిత్రమ్మ, దేవికుంటె శ్రీనివాస్, బిళ్ళూరు నాగరాజు, మునికృష్ణప్ప, జయరామరెడ్డి, సోమశేఖర్, మునియప్ప ఇతర మద్దతుదారులు తదితరులు పాల్గొన్నారు.



మేనిఫెస్టో విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా దాసిమయ్య జయంతి



దాసిమయ్య చిత్రపటానికి పుష్పాంజలి

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేవరదాసిమయ్య జయంతిని వచనజ్యోతి బళగ ఆధ్వర్యంలో అర్థవంతంగా ఆచరించారు. దేవర దాసిమయ్య (జేడర దాసిమయ్య) పై చర్చాగోష్టి నిర్వహించారు. దాసిమయ్య పదో శతాబ్దానికి చెందినవారుగా వక్తలు పేర్కొన్నారు. సురపుర ప్రాంతం ముదనూరు గ్రామంలో జన్మించిన ఆయన బాల్యంనుంచే పరమశివుడి భక్తుడిగా ఉండేవారు. సుదీర్ఘ తపస్సును ఆచరించి శివుడికృపకు పాత్రులయ్యారన్నారు. పరమశివుడు ప్రత్యక్షమై దాసిమయ్యాగా సంబోధిస్తూ వరం కోరుకోమనగా మీ దర్శనంతో జన్మ సార్థకమైందని మోక్షానికి మార్గం చూపాలని కోరారన్నారు. దీంతో ప్రజలు సంసారంలో ఉంటూనే ఆధ్యాత్మికత పాటించేలా చైతన్యపరచాలని ఇదే మానవజన్మనకు సార్థకతగా సూచించారన్నారు. దేవుడి ఆజ్ఞమేరకు దాసిమయ్య ప్రజలను చైతన్యం చేశారన్నారు. ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన మహనీయులలో దేవర దాసిమయ్య ఉన్నారన్నారు. ఇందులో భాగంగా పిల్లలకు భక్తిభావాలు కల్పించేలా కన్నడ సంస్కృతిశాఖ సహకారంతో వచనజ్యోతి బళగ చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమని వక్తలు ప్రశంసించారు. కార్యక్రమంలో సంఘం ముఖ్యులు పినాకపాణి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అకాడమీలో వందశాతం ఫలితాలు

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అకాడమీ - అశోక్ పీయూ కళాశాలలో పీయూ ద్వితీయ పరీక్షలలో వందశాతం ఫలితాలు సాధించినట్లు ఎండీ దేవందర్‌రెడ్డి ప్రకటించారు. 452 మంది పరీక్షలలో పాల్గొనగా 347ల మంది డిస్టింక్షన్‌లోను 104ల మంది ఫస్ట్‌క్లాస్‌లోను ఉత్తీర్ణులయ్యారని ఒక విద్యార్థి ద్వితీయ శ్రేణిలో పాస్ అయినట్లు తెలిపారు. అమోద్ నాయక్ 595 మార్కులు సాధించి రాష్ట్ర వ్యాప్తంగా నాల్గో ర్యాంక్‌ను, బెంగళూరు ఉత్తర తాలూకా పరిధిలో రెండోర్యాంక్‌ను పొందారన్నారు. కవన 594, నందిత 591, పూర్విక 590, నవ్య, తేజస్విని, స్ఫూర్తిలు 589 మార్కులు సాధించినట్లు ప్రకటించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందం ప్రత్యేకంగా సత్కరించింది.



విద్యార్థిని సత్కరిస్తున్న అధ్యాపకులు

మోరీని ఢీ కొన్న వ్యాన్.. నలుగురికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

చింతామణి, ఏప్రిల్ 13: సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి జిల్లా కదిరి పట్టణం నుంచి చింతామణి తాలూకాలోని మురగమల్లె గ్రామంలోని అమ్మాజాన్ బావాజాన్ దర్గాకు వస్తున్న వ్యాన్ ఒకటి అదుపు తప్పి మోరిని ఢీ కొంది. శనివారం ఉదయం సుమారు 11.30 గంటలకు చోటు చేసుకున్న ఘటనలో వ్యాన్‌లోని నలుగురు గాయపడ్డారు. వ్యాన్ డ్రైవర్ మస్తాన్ (45), ప్రయాణీకులు రహమత్ (52), ముంతాజ్ (35), షాకీర్ (6)లు గాయపడ్డారు. ప్రమాదంలో వ్యాన్ ముందుభాగం తీవ్రంగా దెబ్బతింది. క్షతగాత్రులను చింతామణి తాలూకా మురగమల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్‌లో తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తమ సొంత స్థలమైన కదిరి ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఆరేళ్ల షాకీర్‌కు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని బట్లహళ్ళి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

రణహద్దు టీజర్ విడుదల

మహదేవపుర, ఏప్రిల్ 13: 'రణహద్దు' కన్నడ సినిమా చిత్రీకరణ ముగింపుదశలో ఉందని త్వరలోనే థియేటర్లలో విడుదల కానుందని డైరెక్టర్ మాణిక్ జై వెల్లడించారు. హోటల్‌లో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో సినిమా టీజర్ విడుదల చేసి మీడియాతో మాట్లాడారు. ఈ చిత్రం యాక్షన్ క్రైం థ్రిల్లర్, కామెడీ, కమర్షియల్ కథగా ఉందన్నారు. కన్నడ, తెలుగు, తమిళం, హిందీ, మళయాళం ఐదుభాషల్లో విడుదల కానుందన్నారు. రణహద్దు సినిమా విడుదలకు ముందే మరో సినిమా చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ చిత్రంలో కొత్తవారికి అవకాశం కల్పించామన్నారు. హీరో యతీవ్ మాట్లాడుతూ ఐదుభాషల్లో విడుదలకు సిద్ధమవుతున్న రణహద్దు సినిమా చిత్రీకరణ ముగింపుదశలో ఉందని వివరించారు. కార్యక్రమంలో రావ్ విజయగల్ రవి, రంజిత్‌కుమార్, లింగడితేర్, మురుగేశ్ తారై కృష్ణన్, మునినంజప్ప, జ్ఞానేశ్వరి, చైత్ర, వైశాలి తదితరులు పాల్గొన్నారు.



టీజర్ విడుదలలో సినిమా బృందం

బీజేపీ ఎంపీ శ్రీనివాస ప్రసాద్ ఇంటికి సీఎం..



శ్రీనివాసప్రసాద్ ఇంట్లో సీఎం సిద్ధరామయ్య తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ మద్దతుకోరేందుకు బీజేపీ ఎంపీ శ్రీనివాస ప్రసాద్ నివాసానికి సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. మైసూరు జయలక్ష్మీపురంలోని ఎంపీ ఇంటికి శనివారం సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. ఇరువురు అరగంటకుపైగా చర్చలు జరిపారు. కాంగ్రెస్ అభ్యర్థులు మైసూరు లక్ష్మణ, చామరాజనగర సునిల్‌బోస్‌లకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. అనంతరం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ శ్రీనివాస ప్రసాద్ నాకు మిత్రుడని, కలసి రాజకీయాలు చేశామని, కొన్ని కారణాలతో ఆయన బీజేపీలో వెళ్లారని నేను కాంగ్రెస్‌లోనే కొనసాగానన్నారు. ప్రస్తుతం శ్రీనివాసప్రసాద్ ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెప్పారని, ఆరోగ్య విషయమై పరామర్శించేందుకు వెళ్లారన్నారు. నేను ఏ పార్టీకి మద్దతు ఇచ్చేది లేదని శ్రీనివాసప్రసాద్ చెప్పినట్లు సీఎం తెలిపారు. రాజకీయాలకు గుడ్‌బై చెప్పానని స్పష్టంగా తెలిపిన మేరకు తాను మద్దతు కోరలేదన్నారు. ఇదే సందర్భంలోనే శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ వయోభారం కారణంగా రాజకీయాలనుంచి తప్పుకున్నానన్నారు. ఆదివారం మైసూరులో ప్రధాని సభకు ఆహ్వానం రాలేదని, వచ్చినా వెళ్లేది లేదన్నారు. సిద్ధరామయ్యతో రాజకీయ చర్చలు జరగలేదని, ఆయన మా ఇంటికి రావడం సంతోషంగా ఉందన్నారు. నామద్దతు కోరారని, రాజకీయాలకు దూరమైనట్లు వివరించడంతో ఎటువంటి అంశాలు చర్చకు రాలేదన్నారు. ఎమ్మెల్యేలు కృష్ణమూర్తి, హరీశ్‌గౌడ, హెచ్‌ఎం గణేశ్‌ప్రసాద్, మాజీ ఎంపీ శివణ్ణతోపాటు పలువురు ఉన్నారు.

పార్కిన్సన్‌పై మరింత అవగాహన తప్పనిసరి

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఇటీవల అధికమవుతున్న పార్కిన్సన్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉందని రామయ్య స్మారక ఆసుపత్రి అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌సీ నాగేంద్రస్వామి అభిప్రాయపడ్డారు. వరల్డ్ పార్కిన్సన్ డేను పురస్కరించుకుని ది టులిప్స్ అండ్ స్పార్క్ పిడి కార్నివాల్ పేరిట చేపట్టిన జాగృతి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పార్కిన్సన్‌కు చికిత్స పొందిన రోగులు తమ అనుభవాలను పంచుకున్నారు. డాక్టర్ నాగేంద్రస్వామి మాట్లాడుతూ దేశంలో 7 మిలియన్లమంది పార్కిన్సన్ బారిన పడ్డారన్నారు. వారి దృష్టిని మరల్చేందుకు 10కుపైగా ఆటలను రూపొందించినట్లు తెలిపారు. వ్యాధిబారిన పడినవారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా పలు కార్యక్రమాలు రూపొందిం చామన్నారు. వ్యాధిబారిన పడినవారిని చిన్నపిల్లల్లా భావించి తగిన సలహా సూచనలతో వారిలో క్రమేపీ చైతన్యం తేవాల్సి ఉందన్నారు. రామయ్య స్మారక ఆసుపత్రి న్యూరాలజీ విభాగం డాక్టర్ అనిశ్ మెహతా మాట్లా డుతూ 50ఏళ్ల పైబడినవారిలో ఎక్కువగా పార్కిన్సన్ సమస్యలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. అనవసరంగా కాళ్ల చేతులు అల్లాడించడం, కోపం చేసు కోవ డం, ఎక్కువగా ఆలోచించడం వంటివి వీటిలో కొన్ని లక్షణాలు అన్నారు. ఇలాం టివి గుర్తిస్తే తగిన పరీక్షలు చేయించి నిర్ధారించుకున్నాక వైద్యుల సలహా సూచన మేరకు చికిత్సలు పొందాలన్నారు. చికిత్సతోపాటు తగినంత వ్యాయామం, కొన్ని థెరపీలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి రోగులకు రామయ్య స్మారక ఆసు పత్రి ప్రతి బుధవారం మధ్యాహ్నం 2 గంటలనుంచి 4వరకు ప్రత్యేక క్లినిక్ ఏర్పా టు చేస్తున్నట్లు తెలిపారు. పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



పార్కిన్సన్ డే జాగృతి కార్యక్రమం ప్రారంభంలో ప్రముఖులు

సరిహద్దులో ముమ్మరంగా వాహనాల తనిఖీ

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్వహించిన తనిఖీలలో రెండు రోజుల్లో భారీగా నగలు, వెండి, వజ్రాభరణాలు స్వాధీనం చేసుకున్నారు. రామనగర, దావణగెరె, చిక్కమగళూరు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని చెక్‌పోస్ట్‌లలో తగిన రికార్డులు లేకుండా తరలిస్తున్న సుమారు రూ.40 కోట్ల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. దావణగెరె జిల్లా లోకికెరె చెక్‌పోస్ట్ వద్ద వాహనంలోని రూ.12.50 కోట్ల విలువైన నగలను, రామనగర జిల్లా బిడది సమీపానగల కణిమిణికె హెజ్జాల చెక్‌పోస్ట్ వద్ద 17.50 కోట్ల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. చిక్కమగళూరు జిల్లా బీరూరు అజ్జంపుర రోడ్డులో రూ.9.45 కోట్ల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. ఇలా మొత్తం కార్యాచరణలో ఎన్నికల అధికారులు, పోలీసులు, వాణిజ్య పన్నుశాఖల అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ బంగారంపై పెట్టుబడుల పట్ల ఆసక్తి

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ రూపం లో పెట్టుబడుల ద్వారా బంగారం కొనుగోలు పట్ల ఆసక్తి పెరుగుతోందని జార్ స్టార్టప్ నిర్వాహకులు ప్రకటించారు. ఈమేరకు బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. 2023లో దేశవ్యాప్తంగా పేరొందిన స్టార్టప్‌లో జార్ కూడా ఉందని ప్రకటించారు. జార్ సంస్థ బెస్ట్‌వెల్త్ టెక్ స్టార్టప్ విభాగంలో గ్లోబల్ ఫిన్‌టెక్ అవార్డు పొందిందన్నారు. వినియోగదారులు జార్ ద్వారా కోరుకున్న క్యారెట్ బంగారంపై పెట్టుబడులు పెట్టవచ్చునని ప్రకటించారు. డిజిటల్ గోల్డ్ వాలెట్‌ల రూపంలో సురక్షితంగా సంగ్రహిస్తున్నట్లు ప్రకటించారు. అవసరం ఉన్నప్పుడు నగదు లేదా బంగారంను పొందే వెసలుబాటు ఉన్నట్లు ప్రకటించారు. జార్ ద్వారా సులభతరంగా పెట్టుబడులకు సాధ్యం కానుందన్నారు. మూడేళ్ళకిందట ఆరంభించిన జార్ దేశవ్యాప్తంగా ప్రగతిపరంగా సాగుతోందన్నారు. కేవలం నిమిషంలోగానే పెట్టు బడులకు అవకాశం ఉందని నిత్యం మిలియన్ కంటే ఎక్కువ లావాదేవీలు సాధ్యమవుతున్నాయని నెలకు 22సార్లు ఆదా పొందిన దాఖలాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం టైగర్ గ్లోబల్, ఆర్కామ్ వెంచర్స్ ట్రైబ్ క్యాపిటల్ వంటి పెట్టుబడుదారులు మద్దతు సాధ్యమైందన్నారు. జార్ మరిన్ని సేవలను విస్తరింపచేయ దలచినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

కార్ టి సెల్ థెరపీ ద్వారా అపోలోలో ఉత్తమ చికిత్సలు

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న 47 ఏళ్ళ మహిళకు కార్ టి సెల్ థెరపీ ద్వారా అపోలో ఆసుపత్రిలో ఉత్తమ చికిత్సలు సాధ్యమని వైద్యనిపుణులు ప్రకటించారు. ఈ మేరకు బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళ లింఫోమా క్యాన్సర్ బారిన పడ్డారన్నారు. క్యాన్సర్‌కు అందించే అన్ని విధాల విధానాలతో చికిత్సలు అందించడం సాధ్యంకాదనే అభిప్రాయాలు వచ్చాయని అంకాలజిస్టు రాకేశ్‌రెడ్డి, వెంకటపతి ప్రదీప్‌లు ప్రకటించారు. కార్ టి సెల్ థెరపీతో పాటు కీమో థెరపీ చికిత్సలు నిరంతరంగా కొనసాగించామన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకున్నారని సాధారణ జీవితం గడుపుతున్నారని ప్రకటించారు.

మే 12న సామూహిక ఉపనయనం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 13: శంకరాచార్య జయంతి పురస్కరించుకుని పట్టణంలోని తాలూకా బ్రాహ్మణ మహాసభ, శంకర్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మే 12న ఉచిత సామూహిక ఉపనయనం నిర్వహించనున్నట్లు మహాసభ అధ్యక్షుడు, కార్యదర్శులు ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 30లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఏఎస్ రవి 9448713681, ఎస్ఆర్ శ్రీనివాస్ మూర్తి 9844057409 లను సంప్రదించాలన్నారు.

ఓటు హక్కుపై జాగృతి



వారపుసంతలో ఓటుహక్కుపై జాగృతి ఇలా..

విజయపుర, ఏప్రిల్ 13: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో పురసభ స్వీప్ సమితి ఆధ్వర్యంలో వారపుసంతలో శుక్రవారం ఓటు హక్కుపై జాగృతి నిర్వహించారు. రెవెన్యూ అధికారి త్యాగరాజ్ మాట్లాడుతూ ఓటు వేయడం ప్రతి పౌరుడి కర్తవ్యమన్నారు. ఓటరుజాబితాలో పేరున్నవారంతా తమ హక్కును తప్పనిసరిగా వినియోగించు కోవాల న్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రజలు తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. ఈ సందర్భంగా పురసభ సిబ్బంది, పౌరకార్మికులు ప్లకార్డులతో ర్యాలీగా సాగారు. హోబళి వ్యాప్తంగా జాగృతి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.